26న బతుకమ్మ వేడుకలకు రావాలి



బస్తీల్లో పర్యటించి బతుకమ్మ వేడుకలకు ఆహ్వానిస్తున్న వి.హనుమంతరావు

అంబర్‌పేట: బతుకమ్మ కుంటలో ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు ప్రజలు హాజరు కావాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు కోరారు. సోమవారం అంబర్‌పేట డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి మహిళలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో నాయకులు రోహిణ్‌రెడ్డి, పులి జగన్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువుల వాడకంపై పోటీలు



విజేతలకు ప్రెషర్‌కుక్కర్ అందజేస్తున్న సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానికంగా నివసించే 2వేల కుటుంబాలకు సోమవారం స్వదేశీ వస్తువుల వాడకంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో స్వదేశీ వస్తువులను 35 నుంచి 38 వరకు వాడిన ముగ్గురు మహిళలను అభినందిస్తూ ప్రెషర్ కుక్కర్‌లను బహుమతులుగా అందించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటీర, లఘు పరిశ్రమలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుందర్‌పటాలే, సభ్యులు గోవింద్‌రాజ్, చౌదరి, కమల్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ డా. విమలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిప్లొమా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 30వ తేదీలోగా ఆన్‌లైన్ (www. nacsindia.org) లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వ్యాలిడేషన్ ఆఫ్ పెన్షన్ బిల్లును రద్దు చేయాలి

హిమాయత్‌నగర్: వ్యాలిడేషన్ ఆఫ్ పెన్షన్ బిల్లును తక్షణమే రద్దు చేయాలని నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్(ఎన్‌సీసీపీఏ) ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.యుగంధర్, కోశాధికారి ఎం.అర్జున్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతో పాటు పెన్షన్ బిల్లు ప్రవేశపెట్టి, రాజ్యాంగంలోని పెన్షన్ రూల్స్ ఆర్టికల్–14ను అతిక్రమించారని ఆరోపించారు. 8వ వేతన కమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు పెన్షనర్స్ పెన్షన్ కూడా అప్‌గ్రేడ్ చేయాలని, ఎన్‌పీఎస్, యూపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. సమావేశంలో ఎన్‌సీసీపీఏ ప్రతినిధులు శివకుమార్, రామచంద్రుడు, శివలింగం, భార్గవచారి, ఎస్.మోహన్ దాస్, సుధాకర్, బి.నర్సింహ, ఎస్.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

'మనం సైతం' పుష్కర వేడుక

బంజారాహిల్స్: నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మనం సైతం' ఫౌండేషన్ పుష్కర మహోత్సవం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా జరిగింది. 12 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఈ ఫౌండేషన్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ కరోనా సమయంలో వందలాది కుటుంబాలకు ఆయన సాయం చేశారన్నారు. అవసరమైన కిట్లు అందించారని, అప్పటి నుంచి కిరణ్ తనకు పరిచయమన్నారు. రాజకీయాలకు సామాజిక సేవలకు సంబంధం లేదన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ మనం సైతం ఫౌండేషన్ టీమ్‌కు, ఫౌండర్ కాదంబరి కిరణ్‌కు అభినందనలు తెలిపారు.

రైల్లో మహిళ మెడలోని గొలుసు చోరీ

కాచిగూడ: రైల్లో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నిజాంపేటకు చెందిన రాజగోపాల్ రెడ్డి తన భార్య కల్పనతో కలిసి ఆదివారం నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తున్నారు. రైలు ఉమ్రి రైల్వే స్టేషన్ వద్ద ఉండగా అగంతకుడు ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

నాలా ఇలా.. వదిలేస్తే ఎలా?



నాలాలో పేరుకు పోయిన చెత్త

- కూలిన కృష్ణానగర్ నాలా ప్రహరీ
- ఇటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న బస్తీవాసులు



విరిగిపడిన నాలా గోడను పరిశీలిస్తున్న స్థానికులు



కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

కాచిగూడ: అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా నాలా దశ మారడం లేదు. గోల్నాక డివిజన్‌లోని కృష్ణానగర్ బస్తీలో నాలాను చూస్తే అసలు ఇది నాలానేనా..? అనే అనుమానం కలుగుతుంది. ఏళ్లు గడుస్తున్నా నాలా అభివృద్ధికి నోచుకోవడంలేదు. నాలా దుస్థితిపై స్థానికులు అధికారులనే బాధ్యులుగా చూస్తున్నారు. నాలాలో వ్యర్థాలు డంపింగ్ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు పూర్తిగా మరిచారు. ఎప్పుడో ఒకసారి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నా అధికారులు ఆ ఫెన్సింగ్ ధ్వసమైనా పట్టించుకోవడం లేదు.

◆ కొందరు రాత్రి పూట గుట్టు చప్పుడు కాకుండా వ్యర్థాలను తెచ్చి నాలాలో పడవేస్తున్నారు. ఈ విధంగా నాలాలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీని వల్ల నాలాలో నీరు ముందుకు కదలడం లేదు. నాలాలో నీరు పూర్తిగా నల్లగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. నాలాల పరిసరాల వారు దుర్గంధంతో సావాసం చేస్తున్నామని అంటున్నారు. వర్షాకాలంలో నాలా పొంగిపొర్లుతూ తమ ఇళ్లలోకి వరద చొచ్చుకు వస్తోందని పలువురు అంటున్నారు. నాలాకు ఎత్తయిన ప్రహరీ నిర్మించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వరద నీరు ఇళ్లలోకి రాకుండా చూడాలని, ముందుగా నాలాలోని వర్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కూలిన నాలా ప్రహరీ



నాలా ప్రహరీ ఇటీవల కూలి మంచినీటి పైపులైన్‌పై పడటంతో పైపులైన్ పూర్తిగా విరిగిపోయింది. నాలా ప్రహరీ మొత్తం పూర్తిగా ఒకవైపు వంగిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. నాలా బ్రిడ్జి గోడ కూడా ప్రమాదకరంగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలి.
– పుష్ప, కృష్ణానగర్

పాములు వస్తున్నాయి..



ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ప్రమాదకరంగా ఉన్నాయి. తమ బస్తీ మూసీ కాలువకు అనుకుని ఉండటంతో విష సర్పాలు, క్రిమికీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయి. ఇళ్ల చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడంతో భయం భయంగానే ఉండాల్సి వస్తోంది.
– ముత్తమ్మ, స్థానికురాలు

వీధి దీపాలు లేవు..



వీధి దీపాలు లేక రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. రాత్రి సమయాల్లో ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే భయంగా ఉంది. వీధి దీపాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.
– దుర్గా, కృష్ణానగర్ బస్తీ

చిట్టి తల్లికి.. పెద్ద కష్టం!

నాలుగేళ్ల చిన్నారికి అరుదైన రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి



- వైద్యానికి మరో రూ.10లక్షలు అవసరం
- ఖర్చు భరించలేక తల్లిదండ్రుల అవస్థలు
- దాతలు సాయం చేయాలని వేడుకోలు



కాచిగూడ: ఆ పేద కుటుంబానికి పెద్ద కష్టమొచ్చింది. మురిపెంగా చూసుకుంటున్న తమ చిట్టితల్లికి అనారోగ్య సమస్య వారిని కలిచివేసింది. చిన్న వయస్సులోనే పెద్ద వ్యాధితో బాధ పడుతోంది. బొమ్మలతో ఆడుకోవాల్సిన వయస్సులో ఈ చిన్నారి ఆస్పత్రి బెడ్‌కే పరిమితమవ్వాల్సిన దుస్థితి నెలకొంది. బుడిబుడి అడుగులతో, బోసి నవ్వులతో సందడి చేసిన తమ కలల పంట ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుంటంతో తల్లిదండ్రులు విలవిలలాడిపోతున్నారు. చిన్నారి వైద్యానికి అవసరమైన ఖర్చులు లక్షల్లో అవుతుండటంతో... దయగల దాతలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి తమ కుమార్తెకు ప్రాణ భిక్ష పెట్టాలని ప్రాధేయపడుతున్నారు.

రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి

◆ మైలార్‌దేవ్‌పల్లి పద్మశాలిపురం ప్రాంతానికి చెందిన రాసరి ప్రశాంత్‌గౌడ్ కుమార్తె రాసరి హర్షిణీగౌడ్ (4) రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ) వ్యాధితో కొంత కాలంగా బాధపడుతోంది. బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్స కోసం ఇప్పటికే అప్పులు చేసి దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇప్పుడు చికిత్స కోసం మరో రూ.10లక్షలు అవసరమవుతుందని వైద్యులు చెబుతున్నారు. పాప పరిస్థితి రోజురోజుకు మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత డబ్బు ఖర్చుచేసే స్తోమత ప్రస్తుతం తమ వద్ద లేదని పేర్కొన్నారు.

◆ చిన్నారిని కాపాడేందుకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. మనస్సు మారాజులు ఆపన్నహస్తం అందించి తమ చిట్టితల్లిని ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

ఆర్థిక సాయం చేయాలనుకునే వారు చిన్నారి తండ్రి ప్రశాంత్‌గౌడ్‌ను (ఫోన్ నం. 80742 28166)లో సంప్రదించొచ్చు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 53వ రామాయణ మేళా ప్రారంభం

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో53వ రామాయణ మేళా వేడుకలు ప్రారంభించారు. సోమవారం రామాయణమేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి, ఇతర ప్రతినిధులు కొల్లూరి పవన్‌కుమార్, సుమిత్‌రాఠి, మనోజ్ జైస్వాల్ తదితరులు అమ్మవారికి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవింద్‌రాఠి మాట్లాడుతూ..అక్టోబర్ 2వ వరకు రామాయణమేళా వేడుకలు నిర్వహిస్తామన్నారు. విజయదశమి రోజు రావణ దహనం, శ్రీరాముడి పట్టాభిషేకం, శమిపూజ, ఇతర పలు పూజా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నవరాత్రుల్లో రామాయణమేళా వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజా కళాకారుడు షేక్ నాజర్



షేక్ నాజర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శంకరనారాయణ, కళా జనార్దనామూర్తి

చిక్కడపల్లి: తన గంభీర గళంతో వేలాది శ్రోతలను ముగ్ధులను చేసి ప్రజలను చైతన్య పరచిన బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ అద్భుత ప్రజా కళాకారుడని హాస్య అవధాని శంకరనారాయణ అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో వేదశ్రీ పురస్కార గ్రహీత బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ... గుంటూరు జిల్లాలో కుగ్రామంలో నిరుపేద కుటంబంలో జన్మించిన నాజర్‌కు మంచి స్వరం వరంగా వచ్చిందన్నారు. ఆయన తొలి రోజుల్లో భిక్షాటన కూలీ పనులకు వెళ్లి సంగీతంలో శిక్షణ పొందారని చెప్పారు. హేతువాది అయిన నాజర్‌కు కమ్యూనిస్టు పార్టీ ప్రజానాట్యమండలి ఆయన బుర్రకథలకు ప్రాచుర్యం కల్పించిందని గుర్తుచేశారు. కొన్ని సినిమాల్లో నటించి బుర్రకథ చెప్పినా అక్కడి వాతావరణం నచ్చక తిరిగి తన రంగస్థల కళను నమ్ముకున్నారని తెలిపారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో షేక్ నాజర్ కుమారుడు కళారత్న షేక్ బాపూజీ, తెలంగాణ బుర్రకథ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండి రాజుల శంకర్, కార్యదర్శి సాలం కృష్ణయ్య, సభ్యుడు ఎడ్ల ప్రేమేందర్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో మ్యాక్ సొసైటీ

నల్లకుంట: విశ్వభారతి 'మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ (మ్యాక్)' సొసైటీ లిమిటెడ్ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. నల్లకుంటలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా సొసైటీ సీఈవో రామకృష్ణ, సొసైటీ చైర్మన్ రామకృష్ణ చంద్రమౌళీ మ్యాక్ సొసైటీ వార్షిక నివేదికను సమర్పించి మాట్లాడారు. మ్యాక్ సొసైటీ లాభాల బాటలో పరుగులు తీస్తోందన్నారు. తమ సొసైటీ లాభార్జనలో సొసైటీ సభ్యుల సంపూర్ణ సహకారం ఉందన్నారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన డైరెక్టర్లుగా గురువారెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, జగదీశ్వర చార్యులు, పవమాన రావు నియమితులయ్యారని తెలిపారు.

జీఓ నం.60 రద్దు చేయాలి



కాచిగూడ: మత్స్యకారుల హక్కులను కాలరాసే జీఓ నం.60ని రద్దుల చేసి, మత్స్యశాఖ ఎన్నికలకు సంబంధించిన హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని బీజేపీ ఫిషరీస్ సెల్ స్టేట్ కోకన్వీనర్ రమణ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మత్స్యశాఖ కమిషనర్ నిఖిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రాథమిక స్థాయి, జిల్లా, రాష్ట్ర ఫెడరేషన్‌లకు ఎన్నికలు నిర్వహించాలని అధికారులను కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారని తెలిపారు.

బీజేపీకి ఓటుతో గుణపాఠం చెబుతాం



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేష్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆలస్యంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీజేపీకి ఓటుతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీజేపీ మొదటి నుంచి బీసీలకు వ్యతిరేకంగానే వ్యవహరిస్తోందని విమర్శించారు. బీసీ బిల్లును అడ్డుకోవడం అంటే బీసీల రాజ్యాంగ హక్కులను తాకట్టు పెట్టడమేనని అన్నారు. రాత్రికిరాత్రే ఈడబ్ల్యుఎస్‌కు 10శాతం రిజర్వేష్లు ఇస్తారు కానీ బీసీలకు 42శాతం బిల్లును మాత్రం సంవత్సరాలుగా పెండింగ్‌లో పెడతారా అని ఆయన ప్రశ్నించారు. బీసీల దెబ్బ బీజేపీకి చూపించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. బీసీల సాధికారత కోసం మహా ఉద్యమాన్ని చేపడతామని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక జీవోను తీసుకువచ్చి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన సూచించారు. బీజేపీ నేతలకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

కల్లుగీత కార్మికుల హామీలు నెరవేర్చాలి



బాగ్‌లింగంపల్లిలో మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్, వెంకటేష్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డీఎస్‌డీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కోకన్వీనర్ కాటమోని వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని డీఎస్‌డీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం దుకాణాలలో 25 శాతం వాటా, ప్రమాద మరణాలపై వారి కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ నం.560 ప్రకారం ఐదెకరాల భూమి కేటాయించాలన్నారు. అదే విధంగా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయిపాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం సమర్పిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సోమవారం ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకి తెలంగాణ కల్లుగీత సంఘం నేతలు వినతి పత్రం సమర్పించారు. వృత్తిలో ప్రమాదాలు పెరుగుతున్నందున కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియో డబ్బులు రూ.12.6కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్లు పైబడిన గీత కార్మికులకు పింఛన్ అమలు చేయాలన్నారు. చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదెకరాల చొప్పున భూమి ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సంఘం నేతలు వెంకటరమణ, వెంకటనరసయ్య, జంగన్నగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శంకరమఠంలో బ్రాహ్మి అలంకరణలో శారదాదేవి







బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో కనకాల కట్టమైసమ్మ, అంబర్‌పేట మహంకాళి, చిక్కడపల్లి వివేక్‌నగర్ భవాని మాతా



బర్కత్‌పురలో ప్రతిష్టించిన దుర్గామాత

జై మాతా ది.!

- అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం
- మొదటి రోజు బాలాత్రిపుర సుందరిదేవీగా దర్శనమిచ్చిన అమ్మవారు



భారీ సెట్టింగ్ విద్యుద్దీపాల వెలుగులో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీకనకాల కట్టమైసమ్మ దేవాలయం



భవానీశంకర ఆలయంలో జరిగిన పూజలో ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్



అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో అమ్మవారికి అభిషేకం చేశారు. మొదటి రోజు అమ్మవార్లను బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు. తొమ్మిదు రోజులు ఉపవాసం ఉండే భక్తులు సాయంత్రం అమ్మవారికి జరిగే హారతిలో పాల్గొని ఉపవాసం విడిచారు. కాలనీలు, బస్తీలలో మండపాలు ఏర్పాటు చేసి దుర్గామాతలను ప్రతిష్ఠించారు. భారీ సెట్టింగ్‌లు వేసి రంగురంగుల విద్యుద్దీపాలతో వీధులను అలంకరించారు. ఈ సందర్భంగా రెండు నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.
– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో జరిగిన పూజలో చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి



కట్టమైసమ్మ దేవాలయంలో నిర్వహించిన చండీ హోమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు